క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల్లో హమాలీలను పెంచాలి

వెల్దుర్తి(తూప్రాన్) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీల సంఖ్య పెంచాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్, ఉపాధ్యక్షుడు వెంకటేశం అన్నారు. సోమవారం మండలంలోని శేరీల, చెర్లపల్లి, ఎం.జలాల్‌పూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలో కాంటాలు ప్రారంభించి నెల రోజులు గడిచినా సరిగా హమాలీలు లేకపోవడం, లారీలు సరిగా రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో వడ్లకుప్పలు పేరుకుపోయాయన్నారు.

మిషన్ భగీరథ నీటికి పరీక్షలు



భగీరథ నీటిని పరిశీలిస్తున్న అధికారులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని ఖాసీంపూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు, లోకల్ బోర్ వాటర్, ఫిల్టర్ వాటర్ పై మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి పరీక్షలు నిర్వహించారు. సోమవారం మిషన్ భగీరథ వాటర్‌ను ఒక గ్లాసులో తీసుకొని వాటిలో రెండు ఎలక్ట్రోడ్లను పెట్టడం వల్ల ఆ బల్బు సాధారణంగా వెలిగింది. దీంతో ఆ నీటిలో మానవ శరీరానికి కావాల్సిన మినరల్స్ అన్ని కూడా సమపాలల్లో ఉన్నాయి. మిషన్ భగీరథ వాటర్‌ను తాగి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, మిషన్ భగీరథ హెల్పర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ ప్రారంభం



వివరాలను నమోదు చేస్తున్న ఏఓ ప్రవీణ్, ఏఈఓ విజృంభణ

చిన్నశంకరంపేట(మెదక్): రైతు గుర్తింపు కార్డుల కోసం రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మండల కేంద్రంలో సోమవారం ప్రారంభించారు. ఏఓ ప్రవీణ్‌కుమార్, ఏఈఓ మధులిక ఆధ్వర్యంలో రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేయడంతోపాటు ఫొటో అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా ఏఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులకు కేంద్ర ప్రభుత్వం యూనిక్ నంబర్‌తో కూడిన గుర్తింపు కార్డును జారీ చేయనుందన్నారు. రైతుల ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, పాస్‌బుక్ వివరాలు, సర్వే నంబర్లు, సాగు వివరాలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. రైతులు అందరూ ఈ కార్డును పొందాలని కోరారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఏఓ రాం ప్రసాద్



రైతుల వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఒక్క రైతు వ్యవసాయాధికారుల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఏఓ రాం ప్రసాద్ తెలిపారు. సోమవారం టేక్మాల్ మండలంలోని ఎలకుర్తి గ్రామంలో రైతుల వివరాలు అగ్రిస్టాక్ అప్ ద్వారా ఫార్మర్ రిజిస్ట్రీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మర్ రిజిస్ట్రీ గురించి వివరిస్తూ ఆధార్, పట్టా పాస్ బుక్, మొబైల్ నంబర్ ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయడంతో 14 అంకెల ఐడీ వస్తుందని తెలిపారు. ఈ ఐడీని కేంద్రం ప్రభుత్వ పథకాలకు అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

అకాల వర్షంతో వరి పంట నష్టం



గడిపెద్దాపూర్‌లో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానకు వరి పంట దెబ్బతింది. చేతికొచ్చిన పంట వర్షం పాలు కావడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను సోమవారం మండల వ్యవసాయాధికారి రాజేశ్ గడిపెద్దాపూర్ గ్రామంలో పర్యటించి పరిశీలించారు. వడగండ్ల వానకు 264 ఎకరాలలో వరి పంట దెబ్బతిని రైతులు నష్టపోయినట్లు ఏఓ తెలిపారు. ప్రభు త్వం నుంచి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇందులో ఎంపీఎస్ఓ సుమయ, ఏఈఓ విఠల్ పాల్గొన్నారు.

మంజీరాలో మృత్యుఘోష

సూసైడ్ పాయింట్‌గా మారిన చిట్కుల్ బ్రిడ్జి

- ఆరు నెలలో ఎనిమిది మంది మృతి
- సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదంటున్న వైద్యులు



మంజీరాలో గల్లంతైన వ్యక్తిని గాలిస్తున్న గజ ఈతగాళ్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): 'సూసైడ్ ఈజ్ ఏ పర్మినెంట్ సొల్యూషన్ ఫర్ ఏ టెంపరరీ ప్రాబ్లం'అని ఓ తెలుగు సినిమాలో ఉంటుంది. కానీ కొంతమంది మాత్రం ఇప్పటికీ చిన్న, చిన్న సమస్యలకు కూడా తనువు చాలిస్తున్నారు. పోరాడలేక పారిపోతున్నారు. మంజీరా నది మెదక్ జిల్లా వరప్రదాయిని. కేవలం ప్రకృతి ప్రేమికులకు మాత్రమే కాకుండా అన్నదాతలకు కూడా ఈ నది ఎందో దన్నుగా నిలుస్తోంది. ఏళ్లుగా మెదక్ పాలిట వరంలా మారిన మంజీరాలో ప్రస్తుతం మృత్యు ఘోష వినిపిస్తోంది. ఆత్మహత్యలు, హత్యలు, అనుమానాస్పద మరణాలు.. ఇలా పేరేదైతేనేం మంజీరాకు మకిలి అంటుతోంది. మంజీరా నది నర్సాపూర్ డివిజన్‌లోని చిలప్‌చెడ్ మండలం గుండా కూడా ప్రవహిస్తుంది. ఈ దారిలో చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామం వద్ద నదిపక్కనే చాముండేశ్వరి అమ్మవారి ఆలయం ఉంది. ఈ ఆలయ సమీపంలో ఉన్న బ్రిడ్జి ఆత్మహత్యలకు కేంద్రంగా మారింది. గడిచిన ఆరునెలల కాలంలో ఎనిమిది మంది చిట్కుల్ వంతెన పై నుంచి దూకి ఉసురు తీసుకున్నారు. గతేడాది నవంబర్ నుంచి ఈ ఆత్మహత్యల తంతు కొనసాగుతోంది. కేవలం మంజీరా పరివాహక ప్రాంతాలకు చెందిన వారు మాత్రమే కాకుండా హైదరాబాద్ వంటి నగరాల నుంచి వచ్చి కూడా ఇక్కడ ఆత్మహత్య చేసుకుంటున్నారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మృతదేహం మంజీరాలో లభించడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఈ ఆరు నెలల కాలంలో కొంత మంది ఆత్మహత్య చేసుకోగా.. కొంత మంది శవాలు అనుమానాస్పదరీతిలో నదిలో లభించాయి. డిసెంబర్‌లో మానసిక వ్యధతో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకునేందుకు నదిలోకి దిగగా.. అక్కడే ఉన్న జాలర్లు విషయాన్ని గమనించి, ఆమెను రక్షించారు.

చావే సమస్యకు పరిష్కారం కాదు



ప్రతి సమస్యకు చావే పరిష్కారం కాదు. ఎలాంటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. ఆ పరిష్కారాన్ని వెతకాలి. అంతేగాని ధైర్యం కోల్పోయి ఆత్మహత్య చేసుకోవడం సరికాదు. వ్యక్తి ఆత్మహత్యతో కుటుంబం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంటుంది. సిబ్బందితో మంజీరా తీరాన, చిట్కుల్ బ్రిడ్జిపైన పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ఉన్నాం.

నర్సింహులు, చిలప్‌చెడ్ ఎస్సై

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి:



సమస్యలనేవి ప్రతి ఒక్కరికీ ఉంటాయి. సమస్య వచ్చినప్పుడే ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి. క్షణికావేశానికి లోనై ఆత్మహత్యకు పాల్పడకూడదు. సమస్యలను తట్టుకోలేక తరుచూ చచ్చిపోతా అనే వ్యక్తులను తప్పనిసరిగా మానసిక వైద్యుడికి చూపించాలి. అందుబాటులో లేకపోతే 14416 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే.. వారు వచ్చి కౌన్సెలింగ్ ఇస్తారు.

శ్రీకాంత్, వైద్యుడు, కాడిపల్లి

లీకేజీకి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేపట్టిన అధికారులు

అల్లాదుర్గం(మెదక్): ఈనెల 3వ తేదీన 'పొదల్లో నల్లా.. నీరు పట్టుకునేదెలా' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ వెంటనే లీకేజీకి మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కరం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. పరిసర ప్రాంతాల్లో పొదలు సైం తొలగిస్తామని కార్యదర్శి చెప్పారు.

విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని మీర్జాబేగ్‌తో ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పదో తరగతిలో ప్రతిభ కనబర్చి పట్టణ స్థాయిలో అధిక మార్కులు సాధించిన ఓ విద్యార్థినిని సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి అభినందించారు. నర్సాపూర్‌కు చెందిన డాక్టర్ మీర్జానజీంబేగ్ డాక్టర్ ఫౌజియాబేగంల కూతురు మార్యంమీర్జా బేగ్ పదో తరగతిలో పట్టణ స్థాయిలో టాపర్‌గా నిలిచింది. ఆమెకు ఎమ్మెల్యే మెమెంటో అందచేసి శాలువాతో సన్మానించారు. వైద్యులైన మీర్జానజీం బేగ్, ఫౌజియాబేగంలు హజ్‌కు వెళ్తున్న సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి వారిని కూడా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట నాయకులు శేఖర్, నయీం. భిక్షపతి, ప్రసాద్ ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



అచ్చంపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న హెడ్‌మాస్టర్ లక్ష్మీనారాయణ

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని మండలంలోని అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ ఉపాధి కూలీలను కోరారు. సోమవారం గ్రామంలో ఉపాధి పనులు కొనసాగుతున్న వద్దకు వెళ్లి తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపునకు ఉదయం 8 నుండి 11 గంటల వరకు తమ పిల్లలను పంపించాలని కోరారు.

ఘనంగా ఆలయ తృతీయ వార్షికోత్సవం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలం కేంద్రం కౌడిపల్లి బతుకమ్మతండాలో జగదాంబదేవి, సేవాలాల్ మహరాజ్ ఆలయం తృతీయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద చరన్‌మహరాజ్ పూజారి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అలాగు మండలంలోని రాజిపేటలో రేణుక ఎల్లమ్మదేవి ఆలయం పదవ వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైంది ఉత్సవాలలో భాగంగా మొదటిరోజు హోమం నిర్వహించి గంగకు వెళ్లారు.

దేవులతండాలో నేటి నుంచి..

మండలంలోని దేవులతండాలో శ్రీజగదాంబదేవి సేవాలాల్ మహరాజ్, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఈనెల6 నుంచి 8వ తేదీ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, తండావాసులు తెలిపారు.

బగలాముఖీ జయంతి మహోత్సవం



బగలాముఖీ అమ్మవారు

శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ జయంతి మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బగలాముఖీ శక్తి పీఠంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు వెంకటేశ్వశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, అభిషేకం, మహామంత్రహవనం, పూర్ణాహుతి, మహామంగళనీరాజనం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భానుచందన ఈశ్వరవరప్రసాద్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

కొల్చారం తహసీల్దార్‌గా శ్రీనివాస్‌చారి



కొల్చారం(నర్సాపూర్): మండల నూతన తహసీల్దార్‌గా శ్రీనివాస్ చారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన గఫార్ మియా మెదక్ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చారి మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో సేవలు అందించనున్నట్లు తెలిపారు.

హరీశ్‌రావును కలిసిన నాయకులు

చేగుంట(తూప్రాన్): బీ కొండాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో పార్టీ తరపున చేయాల్సిన కార్యక్రమాలను గురించి చర్చించినట్లు తెలిపారు. కార్యకర్తలకు భరోసాగా ఉండాలని మాజీ మంత్రి సూచనలు చేసినట్లు వారు తెలిపారు. హరీష్‌రావును కలిసిన వారిలో రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ఎంఈఓ యాదగిరి



క్యాంపును ప్రారంభిస్తున్న ఎంఈఓ యాదగిరి, హెచ్‌ఎం సాంబయ్య

వెల్దుర్తి(తూప్రాన్): వేసవి సెలవుల్లో విద్యార్థులు ఉచిత సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ యాదగిరి అన్నారు. వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో సోమవారం యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. 20 వరకు నిర్వహించనున్న క్యాంపులో విద్యార్థులకు యోగా, డ్రాయింగ్, పెయిటింగ్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించడానికి ముందుకొచ్చిన ఉపాధ్యాయుడు రవీందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, కంప్యూటర్ ఆపరేటర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో సోమవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాధికారి యాదగిరి తెలిపారు. 6వ తరగతి నుంచి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 5వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మహేందర్, వెంకటస్వామి, సీఆర్‌సీ రాజు, రోజా, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం ఇప్పిస్తాం

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు
- దెబ్బతిన్న పంటల పరిశీలన



రాయిలాపూర్‌లో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

రామాయంపేట(మెదక్): అకాల వర్షాలతో మండలంలోని రాయిలాపూర్‌లో దెబ్బతిన్న పంటలను సోమవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు పరిశీలించారు. ఈమేరకు అయన రైతులు, కార్యకర్తలతో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించి, బాధిత రైతులను ఓదార్చారు. ఈవిషయమై తాను సీఎం, మంత్రులతో మాట్లాడి బాధిత రైతులకు నష్టపరిహారం ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుప్రభాతరావు, ఇతర నాయకులున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

శివ్వంపేట(నర్సాపూర్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం శివ్వంపేటలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతితో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కానున్నాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



కవాతు నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి గ్రామ పురవీధులగుండా కవాతు చేపట్టారు. ఈసందర్భంగా ఆర్‌పీఎఫ్ సీఐ విజయ్‌కుమార్ వర్మ, జితేంద్ర నంద్వార్, రామచంద్ర అసిస్టెంట్ కమాండెంట్, ఏఎస్ఐ విఠల్ మాట్లాడుతూ.. ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించేందుకే కవాతు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షం.. మామిడి రైతులకు నష్టం



మామిడి కాయలను పరిశీలిస్తున్న సోమలింగారెడ్డి

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన వడగళ్ల వానలకు రాలిన మామిడి తోటలను సోమవారం మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అకాల వర్షాలకు మామిడి కాయలు పూర్తిగా నేలరాలాయన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

చల్మెడ గ్రామంలోని కొనుగోలు కేంద్రాలను సోమలింగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆకస్మికంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. రైతులు ధాన్యం తడవకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీలత, పంజా శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నర్సాపూర్ రూరల్: మండలంలోని పెద్ద చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006–2007 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాష్ రెడ్డి, పార్వతి, విజయ్ కుమార్, మురళి, వెంకటేశం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ తూప్రాన్ తహసీల్దార్‌గా శ్రీనివాస్

తూప్రాన్: తూప్రాన్ తహసీల్దార్‌గా శ్రీనివాస్ సోమవారం ఉదయం బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ పని చేసిన తహసీల్దార్ విజయలక్ష్మి నర్సాపూర్ డీఏఓగా బదిలీపై వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రభుధాస్ చిన్న శంకరంపేటకు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్‌గా బాధత్యలు చేపట్టిన శ్రీనివాస్ గతంలో ఆర్ఐగా విధులు నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

రామాయంపేట(మెదక్): మండలంలోని లక్ష్మాపూర్, కాట్రియాల గ్రామాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ రజనికుమారి సోమవారం సందర్శించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో త్వరితగతిన ధాన్యం తూకం చేయించాలని సెంటర్ల నిర్వాహకులను సూచించారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తిరుమలాపూర్‌లో సోమవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.13 లక్షలతో ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు భవాని, నాయకులు జనార్ధన్, గంగారెడ్డి, రాజేష్, సుభాష్‌గౌడ్, సత్యనారాయణరావు, సలీం, విఠల్‌రెడ్డి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు యోగాలో శిక్షణ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి జెడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు సోమవారం యోగాలో శిక్షణ ఇచ్చారు. ఆటలు, పాటలు, స్పోకెన్ ఇంగ్లిష్‌తోపాటు వివిధ అంశాలపై శిక్షణ ఉంటుందని నార్సింగి ఎంఈఓ గంగాబాయి తెలిపారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు ఆర్థిక సహాయం అందుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. సోమవారం తన నివాసంలో నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి మండలాలకు చెందిన ఆరుగురు లబ్దిదారులకు సుమారు రెండు లక్షల రూపాయల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు శేకర్, నయిం, బాల్‌రెడ్డి, ప్రసాద్, ఎల్లం, అమర్‌సింగ్, లాయక్ పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి పథకం చెక్కులను వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు చెన్నప్ప , ప్రభు, బేతయ్య, మహేశ్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సిద్ధయోగ వార్షికోత్సవం ప్రారంభం

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని ఎల్లాపూర్‌లో సోమవారం రేణుకా ఎల్లమ్మ ఆలయ సిద్ధ యోగ వార్షికోత్సవం ప్రారంభమైంది. మొదటి రోజు వేద పండితుడు అమ్మన్నగారి కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా హోమం, నాగదేవత ప్రతిష్ఠ నిర్వహించారు. మంగళవారం కల్యాణోత్సవం, ఒడి బియ్యం , బోనాల కార్యక్రమం ఉంటుంది. రెండు రోజుల పాటు సాయంత్రం మిద్దె రామగౌడ్ కళాబృందం ఒగ్గు కథ చెప్పనున్నారు.

◆ ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని ఎంపీడీఓకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. సోమవారం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు తిరుమలేష్, వెంకటేశ్వరరావు, నాసర్‌ఖాన్ తదితరులు ఎంపీడీఓను కలిసి పలువురు వ్యాపారులు రహదారి పక్కన ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తుండటంతో బాటసారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అధికారులు స్పందించి తొలగించాలని కోరారు.

◆ వేలం పాటకు విశేష స్పందన

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలోని వాహనాలకు సంబంధించిన విడి భాగాల (పాడైనవి) విక్రయానికి సోమవారం వేలం పాటలు నిర్వహించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు వేలం పాటలు నిర్వహించినట్లు అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. వేలం పాటలో 21 మంది పాల్గొన్నారని, టైర్లకు రూ.56,000, బ్యాటరీలకు రూ. 1,49,000, ఇతర విడి భాగాలకు రూ.18,000 వచ్చినట్లు చెప్పారు. వీటిని కామారెడ్డికి చెందిన అబ్దుల్ ఖలీల్ అనే వ్యక్తి సొంతం చేసుకున్నట్లు తెలిపారు.

◆ ఉపాధి పనులను వేగవంతం చేయండి

చిన్నశంకరంపేట(మెదక్): జాతీయ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ దామోదర్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ సిబ్బందిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డుదారులందరికీ వంద రోజుల పని దినాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రాజ్‌కుమార్, టీఏ సంపత్ పాల్గొన్నారు.

◆ జరిమాన

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపల్ అధికారులు సోమవారం పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని హోటళ్లు, బేకరీ యజమానులకు జరిమానాలు విధించారు. పారిశుద్ధ్య నిర్వహణ లోపించడంతో బేస్ట్ బేకరి యజమానికి రూ.10,000, టీ 20 నిర్వాహకులకు రూ. 5,000 చొప్పున జరిమానా విధించినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ తెలిపారు.

◆ ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కాంటా చేసిన వెంటనే రైసు మిల్లులకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని, రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ మన్నన్ తెలిపారు. గవ్వలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు.

◆ పెండింగ్ బిల్లులు చెల్లించండి

తూప్రాన్: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్‌లు కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, ఐదు డీఏలు తక్షణం ఇవ్వాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానికత ఆధారంగా అదనపు పోస్టులు సృష్టించి జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు.

◆ విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్‌షాక్‌తో ఆవు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. జెగ్యా తండాకు చెందిన మనోత్ విఠల్ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేయడంతో పాటు పాడి పశువులతో ఉపాధి పొందుతున్నాడు. పొలాల వద్దకు మేతకు వెళ్లిన ఆవు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది.